క్లుప్తంగా

స్పందనలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి సోమవారం తెలిపారు. వాటిలో రెండు భూముల రీ సర్వే చేపట్టాలని, పట్టాదార్ పాసు పుస్తకాలు కావాలని ఒకటి, మినరల్ ప్లాంట్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని మరొక అర్జీ వచ్చాయని అన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, హౌసింగ్ ఏఈ నరసింహారావు, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, ఏపీఎం కోట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: స్పందన కార్యక్రమానికి దాఖలయ్యే ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరు అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓ స్పందనలో 12 అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన వారు 12 అర్జీలను అందజేశారని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

నందిగామ: పట్టణంలోని 17వ వార్డులో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరిగాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంతంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు కౌన్సిలర్ బాపట్ల సాంబయ్య, పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ

పెనుగంచిప్రోలు: బాగా చదివి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఎస్ఐ ఎస్.హరిప్రసాద్ అన్నారు. స్థానిక లైఫ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు ఎం.శ్రీనివాసరావు, ప్రమీలను అభినందించారు.

నేడు పల్లగిరిలో మెగా పశు వైద్య శిబిరం

నందిగామ: గరికపాడులోని డాక్టర్ కే ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పల్లగిరి గ్రామంలో మెగా పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు ఈ పశు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరంలో అన్ని జాతుల పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కేవీకేకు పరిశోధన మండలి సంచాలకుని రాక

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (అటారి) హైదరాబాద్ సంచాలకుడు డాక్టర్ షేక్ ఎన్.మీరా వస్తున్నారని కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. ఆయన మంగళవారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మిర్చి, పత్తి, ఉద్యాన పంటల రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందిగామ: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.చైర్‌పర్సన్ మండల వరలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో 23 అంశాలపై చర్చించి ఆమోదిస్తారన్నారు.

నేడు వత్సవాయి మండల ఆసరా కార్యక్రమం

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరాకు సంబంధించి మూడో విడత రుణమాఫీ నిధుల విడుదల చేసే కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు వత్సవాయి మండలానికి సంబంధించిన కార్యక్రమం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని, డ్వాక్రా మహిళలంతా పాల్గొనాలని కోరారు.

ప్రజలకు చేరువైన పాలన

నందిగామ రెవెన్యూ డివిజన్‌గా మారి నేటికి ఏడాది

నందిగామ: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధన కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతోంది. ఇందులో భాగంగానే ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. కొత్తగా జిల్లాలను, రెవెన్యూ డివిజన్ లను ఏర్పాటు చేసింది. నందిగామను రెవెన్యూ డివిజన్ చేయాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. ఆ కోరికను ప్రభుత్వం నెరవేర్చి నేటికి ఏడాది పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

ఏడు మండలాలతో రెవెన్యూ డివిజన్

కృష్ణాజిల్లా నుంచి ప్రభుత్వం విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లాను ఏర్పాటు చేసింది. ఇదే తరుణంలో నందిగామ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అనేకమార్లు ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ తరుణంలో నందిగామను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి 2022 మార్చి 4వ తేదీన నందిగామలో ఆర్డీవో కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో నందిగామ, జగ్గయ్యపేట రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7 మండలాలు ఉండగా, రెండు మునిసిపాలిటీలు, 155 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.



నందిగామ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం

రోజు మొత్తం వెళ్లిరావడానికే సరిపోయేది

గతంలో జగ్గయ్యపేట, నందిగామ ప్రాంత ప్రజలు మండల స్థాయిలో పని కాకపోతే విజయవాడ లేదా మచిలీపట్నం వెళ్లవలసి వచ్చేది. దాదాపు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం వెళ్లాలంటే రోజు మొత్తం వెళ్లటానికి, రావడానికి సరిపోయేది. ఈ తరుణంలో ప్రభుత్వం నందిగామను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసిన తర్వాత ఆర్డీవో స్థాయి అధికారి అందుబాటులో ఉండడంతో సమయం, డబ్బు కూడా ఆదా అవుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్థానికంగా ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేసిన తర్వాత సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని ప్రజలు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నారు.

4077 సమస్యల పరిష్కారం

నందిగామ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటివరకు అధికారుల లెక్కల ప్రకారం వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం 4705 అర్జీలు అందాయి. వాటిలో ఇప్పటికే 4077 సమస్యల పరిష్కారం అయ్యాయి. మరో 628 దరఖాస్తులు వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కాని రెవెన్యూ భూములకు సంబంధించిన అనేక సమస్యలు కూడా నందిగామ రెవెన్యూ డివిజన్ అయిన తర్వాత పరిష్కారమయ్యాయి.

చిరకాల కోరిక తీరింది



నందిగామను రెవెన్యూ డివిజన్ చేయాలి అనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. రాష్ట్ర ముఖ్యమంత్రి నందిగామ ప్రాంత ప్రజల కోసం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. నిజంగా ఈ రుణం ప్రజలు తీర్చుకోలేనిది. ముఖ్యంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశాక దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు కూడా ఇక్కడే పరిష్కారమవుతున్నాయి.

– రామినేని నరసింహారావు, నందిగామ

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోండి



ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నందిగామను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రథమ ఆర్డీవోగా పనిచేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కరించగలిగాం. డివిజన్ పరిధిలో ఏ సమస్య అయినా ప్రజలు నిర్భయంగా నా దృష్టికి తీసుకురావచ్చు.

– ఎ.రవీంద్రరావు, ఆర్డీవో, నందిగామ

కొనసాగుతున్న సత్యమ్మ అమ్మవారి జాతర

నందిగామ: మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజైన సోమవారం అమ్మవారికి నిత్య పూజలతోపాటు పలు రకాల అభిషేకాలు, విశేష అలంకారాలు, కుంకుమార్చన ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నందిగామ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఓపెన్ టెన్త్ కోసం 8 పరీక్ష కేంద్రాలు, ఓపెన్ ఇంటర్ కోసం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కోఆర్డినేటర్ నక్కా బాబురావు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలకు 1523 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 1399 మంది హాజరయ్యారని, 124 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్‌కు సంబంధించి 3240 మంది విద్యార్థులకు గాను 3056 మంది విద్యార్థులు హాజరయ్యారని 184 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. నందిగామ పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు సెంటర్లలో మొదటిరోజు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అయితే ఈ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జోరుగా సాగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం



నందిగామలో ఓ పరీక్ష కేంద్రంలో రూమ్ నంబరును పరిశీలిస్తున్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు



పేటలో జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



పరిటాల జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలను పరిశీలిస్తున్న డీసీపీ సత్తిబాబు

నందిగామ: డివిజన్‌లో సోమవారం ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో ప్రతి విద్యార్థిలోనూ టెన్షన్ కనిపించింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోసం కూలింగ్ వాటర్ ఏర్పాటు చేశారు. నందిగామ ఉప విద్యా శాఖాధికారి కార్యాలయ పరిధిలోని తొమ్మిది మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 48 కేంద్రాల్లో 8,272 మంది విద్యార్థులకు గాను 8,091 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరయ్యారని, 181 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు.

విద్యార్థులకే కాదు..తల్లిదండ్రులకు టెన్షన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఇటు విద్యార్థులతోపాటు అటు తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ కొట్టొచ్చినట్లు కన్పించింది. తొలిసారి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతుండటంతో విద్యార్థుల్లో ఓ పక్క ఆసక్తి, మరో పక్క ఆందోళన చోటు చేసుకున్నాయి. పరీక్ష ఎలా జరుగుతుందో, ప్రశ్న పత్రం ఎలా ఉంటుందోనని టెన్షన్ పడ్డారు. ఉదయం 8 గంటలకే దాదాపు 90 శాతం మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారితోపాటు తల్లిదండ్రులు కూడా వచ్చారు. హాల్ టిక్కెట్ నంబరు చూసుకోవడం మొదలు పరీక్ష హాలులోకి వెళ్లే వరకు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎన్నో జాగ్రత్తలు చెప్పి పంపించారు.

వీరులపాడులో...

వీరులపాడు: పదవ తరగతి పరీక్షలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అల్లూరు, జయంతి, వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అధికారులు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు కేంద్రాల పరిధిలో 493 మందికి గాను 475 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 18 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించటంతో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాశారు. పరీక్షా సమయానికంటే ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు అధికారులు విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు.

అల్లూరు కేంద్రాన్ని తనిఖీ చేసిన డీసీపీ సత్తిబాబు

అల్లూరు(వీరులపాడు): పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్టు విజయవాడ డీసీపీ సత్తిబాబు తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్‌లను మూయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఎస్ఐలు సోమేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: పదవ తరగతి పరీక్షలు పట్టణంలో సోమవారం ప్రశాంతంగా ఆరంభమయ్యాయి. పేట పట్టణంలోని ఏడు కేంద్రాలతో పాటు మండలంలో మూడు కేంద్రాలు కలిపి మొదటి రోజున తెలుగు పరీక్షకు 1,638 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా వారిలో నలుగురు గైరుహాజరయ్యారు. 1,634మంది పరీక్ష రాశారు. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు తమ తల్లిదండ్రులతో కలసి వచ్చిన విద్యార్థులు తమ నంబర్లను సరిచూసుకున్నారు. కొన్ని కేంద్రాల్లో ఏ విభాగంలో ఏఏ గదులలో ఏఏ నెంబర్లను కేటాయించారో వివరంగా బోర్డులలో సూచించకపోవటంతో విద్యార్థులు అన్ని గదులను వెతుక్కోవలసి వచ్చింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎంఈవో డి.రవీందర్ తెలిపారు. సీఐ నాగమురళి ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

386 మంది పరీక్షలకు హాజరు

వత్సవాయి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు కలిపి మొత్తం 386 మంది పరీక్షలు రాశారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో రెండు సెంటర్లు కేటాయించగా ఎ.సెంటర్‌లో 197, బి.సెంటర్‌లో 189 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయాన్నే కేంద్రాలకు చేరు కున్న విద్యార్థులు తమకు కేటాయించిన గదుల ను చూసుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా అజ్మీరు సూరిబాబు, వీవీఆర్‌లు క్షుణంగా పర్యవేక్షించారు.



పేటలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



పెనుగంచిప్రోలులో పరీక్ష కేంద్రాలకు వస్తున్న విద్యార్థులు



పేటలో పరీక్ష కేంద్రం బయట వేచి చూస్తున్న తల్లిదండ్రులు

పకడ్బందీగా జరుగుతున్న పది పరీక్షలు

కంచికచర్ల: మండలంలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ లావుడ్యా చిట్టిబాబు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి రోజు తెలుగు పరీక్ష జరిగిందన్నారు. ఈ ఐదు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 824 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 809 మంది హాజరయ్యారని, 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 148 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారని, శ్రీ అక్షర స్కూల్‌లో 144 మందికి 131 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. విజయరాణి ఎ.సెంటర్‌లో 200 మందికి 198 మంది, బి.సెంటర్‌లో 186 మందికి 185 మంది, మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 146మందికి 141మంది పరీక్షలు రాశారన్నారు. మండలంలోని పరిటాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు పరిశీలించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం శర్మ, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మొత్తం మూడు సెంటర్లలో 478 మంది విద్యార్థులకు గాను 475 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ డి.రవీంద్ర, ఏఎస్ఐ సత్యనారాయణ, ఎస్ఐ హరిప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ ఓపెన్ పరీక్షలు కూడా ప్రశాంతంగా మొదలయ్యాయి.

పోషక విలువలతో కూడిన ఆహారం

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఎన్నో రకాల పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం మండల స్థాయిలో పోషణ్ పక్వాడ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నాగమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ కిట్లు, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. బాలామృతంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన రకరకాల ఆహారాలను తల్లులు కూడా తయారు చేసి పిల్లలకు పెట్టాలన్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవటం వలన పిల్లలకు కూడా మంచి ఆహారం అందుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన న్యూట్రిషన్ ఫుడ్‌ను బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఇందిర, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషకాహారాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ నాగమణి, సర్పంచ్ పద్మకుమారి, తదితరులు

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

పెనుగంచిప్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, ముండ్లపాడుతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓ తిరుపతయ్య మాట్లాడుతూ వేసవిలో పనులు చేసేవారికి ప్రభుత్వం ప్రత్యేక అలవెన్స్‌లు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.జ్యోతిబ్రహ్మం, నక్కా కమల, గూడపాటి లావణ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, గూడపాటి రవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మకుమారి

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

పరిటాల(కంచికచర్ల): గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం సేకరించాలని, అదేవిధంగా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో సోమవారం రాత్రి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగనన్న మా భవిష్యత్ నువ్వే జగనన్న అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల ఏప్రిల్ 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారికి అర్థమయ్యేరీతిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజిని, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మాగంటి వినయ భూషణరావు, కంచర్ల పద్మావతి, యద్దనపూడి విజయారావు, జిక్కుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పరిటాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జాతీయ పోటీలకు మైలవరం విద్యార్థి ఎంపిక

మైలవరం: జాతీయ విశ్వ విద్యాలయాల సాఫ్ట్ బాల్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.మున్న ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో రెండు రోజులు జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడని తెలిపారు.

ప్రభుత్వ గోడలు, డివైడర్లపై పోస్టర్లు అంటిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వ కార్యాలయాల గోడలు, రోడ్డు డివైడర్ల పైన అనుమతులు లేకుండా విచ్చలవిడిగా పోస్టర్లు అంటిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం ఆయన స్థానిక సామినేని విశ్వనాథం చిల్డ్రన్ పార్కును పరిశీలించారు. పార్కులో లైటింగ్, పార్క్ ఆర్చ్, వాకింగ్ ట్రాక్, పిల్లల క్రీడా సామగ్రికి రంగులు వేయించాల్సిందిగా మున్సిపల్ ఏఈ శివకోటేశ్వరరావును ఆదేశించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు పార్కు సుందరీకరణకు అవసరమైన మొక్కలను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. రోడ్ల వెంట, వీధుల్లో, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటరీ మేస్త్రులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల గోడలపై, రోడ్ల డివైడర్లపై పోస్టర్లు అంటించిన వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు సూచించారు.



డివైడర్లపై పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అకాల వర్షంతో రైతులకు నష్టం



ఇబ్రహీంపట్నం: ఈదురు గాలులు, అకాల వర్షంతో రైతులు అపారనష్టానికి గురైయ్యారు. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతోపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో మొక్కజొన్న, అరటి తోటలు దెబ్బతిన్నాయి. త్రిలోచనాపురం, జూపూడి, ఇబ్రహీంపట్నం, కిలేశపురం, లంక గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నాయి. అరటి తోటలకు ఇప్పటికే ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు మురళి అనే రైతు తెలిపారు. మొక్కజొన్న పైరు కండెలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. గాలివాన రూపంలో తుడుచుపెట్టుకు పోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.35వేలు వరకు పెట్టుబడి పెట్టారు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న మండల వ్యవసాయ శాఖ అధికారి డి.శైలజ సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్‌లతో నేలవాలిన పంటలపై సర్వే చేయించారు. పంటల నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు.